## నేడు సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన

■ హాజరుకానున్న నేతలు.. భక్తులకు అన్నదానం

కథలాపూర్, అక్టోబర్ 15: రాజారాం తండా గ్రామంలో సోమవారం శ్రీసంతూ సేవాలాల్ మహరాజ్ నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు, చెన్నమనేని వికాస్‌రావు, తుల ఉమ, ఆది శ్రీనివాస్ హాజరవుతున్నారని వారు తెలిపారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజారాంతండా సర్పంచ్ లౌడియా సరిత, రవీందర్‌నాయక్, తిరుపతినాయక్, రాజేశ్‌నాయక్, గిరిజనులు, గ్రామప్రతినిధులు తదితరులున్నారు.

## మేడిపల్లి, భీమారం మండలాల కమిటీ ఎన్నిక

మేడిపల్లి, అక్టోబర్ 15: మేడిపల్లి మండలం పీఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం మేడిపల్లి, భీమారం మండలాల మాదిగ కుల సంఘాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడిపల్లి అధ్యక్షుడిగా మకిలి దాస్, భీమారం అధ్యక్షుడిగా గడ్డం శశికుమార్, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల సురేశ్, ఉపాధ్యక్షులుగా కుందూరి బాలరాజు, సుంకపాక అంజయ్య, లింగంపల్లి గణేశ్, క్యాషియర్లుగా మొనుగూరి గణేశ్, అంబటి గోపిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీమారం టీఏవైఎస్ మండలాధ్యక్షుడు బంగారు దీపక్, ఎంఆర్‌పీఎస్ మాజీ మండలాధ్యక్షుడు దువ్వాసి గంగాధర్, సభ్యులు చిలివేరి వెంకటేశ్, నల్ల నర్సయ్య, ఏనుగంటి హరీశ్, ఎర్రాల రాజేశ్, మకిలి కుమార్, చిట్యాల అన్వేశ్, మొనుగూరి లింగయ్య, మొనుగూరి హన్మంతు, సుంకపాక కోటేశ్, అరవింద్, చిలువేరి లచ్చయ్య, చిట్యాల రాజేందర్ పాల్గొన్నారు.

## గ్రాండ్ ఫెస్టివల్ జెండా ఆవిష్కరణ

కోరుట్ల, అక్టోబర్ 15: పట్టణంలోని టీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదివారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో 100 రోజుల గ్రాండ్ ఫెస్టివల్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'అభినహి తో కబీ నహి' బస్ భరో అని కొటేషన్‌తో ఉద్యోగుల్లో స్ఫూర్తిని నింపేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం విజయమాధురి తెలిపారు. ఇందులో భాగంగా 100 రోజుల పండుగను విజయవంతం చేయాలని ఉద్యోగులకు తగు సూచనలు, సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జీపీ సింగ్ నాయక్, ఆఫీస్ సూపరింటెండెంట్ గంగారం, మెకానికల్ అసిస్టెంట్ ఫోర్‌మెన్ ఐఆర్‌కే రెడ్డి, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటుహక్కు వినియోగంపై సైకిల్ ర్యాలీ

ఓటుహక్కు సద్వినియోగంపై సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 15: ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలంటూ మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని ప్రయోగిల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యువకులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వెల్లుల్ల నుంచి బండలింగాపూర్, విట్టంపేట, జగ్గసాగర్ వరకు నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు.

### పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఎస్పీ

'ప్రయోగిల్లు' ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేస్తూ ముద్రించిన 'ఎందుకు మనం ఓటు వేయాలి' అనే వాల్ పోస్టర్‌ను మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. 'మన ఓటు మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని, మన ఓటు మన ముందు తరాలకు మార్గదర్శకమని, మన ఓటు మన సమాజాన్ని నిర్మిస్తుందని' ముద్రించిన పోస్టర్‌ను డీఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

## రక్తదానం, నేత్రదానంపై అవగాహన

మల్లాపూర్, అక్టోబర్ 15: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం, నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంబంధిత కరపత్రాలను సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసక్తి గల వారు రక్తదానం, నేత్రదానం చేయాలనుకుంటే లయన్స్ క్లబ్ సభ్యులను సంప్రదిచాలని కోరారు. ఇక్కడ అధ్యక్షుడు సంజీవ్, రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, సభ్యులు మహ్మద్ రఫీ, మార్గం రాజేశ్వర్, ముత్యాల రమేశ్, మోర సతీశ్, పుప్పాల మహేశ్, ఏనుగు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ మ్యానిఫెస్టో

■ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చారిత్రాత్మకం
■ ప్రజల సంక్షేమానికి సీఎం కృషి
■ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత
■ జిల్లా కేంద్రంలో సంబురాలు

జై తెలంగాణ నినాదాలు చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత నాయకులు

జగిత్యాల, అక్టోబర్ 15: బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చారిత్రాత్మకమని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో ప్రకటించిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారని, అందుకు అనుగుణంగానే పార్టీ మ్యానిఫెస్టో ప్రకటించారని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే తెలుపు రంగు రేషన్ కార్డు దారులకు రూ.5 లక్షల జీవిత బీమా, రైతు బంధు పథకం కింద ఎకరాకు రూ.16వేలు, వృద్ధాప్య పింఛన్ క్రమంగా రూ. 2016 నుంచి ఐదు సంవత్సరాల్లో 5016, దివ్యాంగులకు రూ.6016కు పెంచేందుకు కృషి చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు అండగా నిలుస్తామని మ్యాని ఫెస్టోలో చేర్చడం చరిత్రాత్మకమన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జడ్పీటీసీ మహేశ్, ప్యాక్స్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, రూరల్ పార్టీ మండలాధ్యక్షుడు బాల ముకుందం, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన దుర్గాదేవీ

జగిత్యాల : టవర్ వద్ద నుంచి అమ్మవారిని ర్యాలీగా తీసుకువస్తున్న భక్తులు

జగిత్యాల, అక్టోబర్ 15: జిల్లా కేంద్రంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం జిల్లా కేంద్రంలో అమ్మవార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీ భక్త మార్కండేయ దేవాలయం, నవదుర్గా, సువర్ణ దుర్గా, కనక దుర్గా, శ్రీదుర్గా భవాని, జయదుర్గా, ఆర్య వైశ్యభవన్, శ్రీ పురాణిపేట అంజనేయ స్వామి ఆలయం, పోచమ్మవాడ, వంజరి సంఘం ఆధ్వర్యంలో శ్రీ వనదుర్గా, ఎడ్ల అంగడి రామాలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, నిర్వాహకులు, పద్మశాలీ సేవా సంఘం నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, అక్టోబర్ 15: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా దుర్గా మాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. యువకులు పెద్ద సంఖ్యలో దుర్గా మాత మాల ధరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, అక్టోబర్ 15: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవీ ప్రతిమలను ప్రతిష్ఠించారు. పెంబట్ల శ్రీదుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో, రేచపల్లి గ్రామంలోని శివరామాంజనేయ ఆలయం, సారంగాపూర్‌లోని సీతారామచంద్ర ఆలయం, లక్ష్మీదేవిపల్లి, లచ్చక్కపేట, బీర్‌పూర్ మండలంలోని బీర్‌పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కండ్లపల్లి, మంగెళ తదితర గ్రామాల్లో దుర్గాదేవీ మండపాల్లో అమ్మవారిని విగ్రహాలను ప్రతిష్ఠించారు.దీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, నాయకులు, దీక్షాపరులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి, అక్టోబర్ 15: ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి వారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో ఆదివారం దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన దేవాలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వరాలయంలో దేవీ నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన ఆదివారం అమ్మవారు శైలపుత్రి రూపంలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకున్నారు...

### అశ్వవాహనంపైఊరేగింపు సేవ..

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీయోగ, ఉగ్రనారసింహ స్వామివారల ఉత్సవ మూర్తులను అశ్వవాహనం పై ఉంచి మేళతాళాల మధ్య పట్టణ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు దారికి ఇరువైపులా మంగళహారతులతో స్వామివారి సేవకు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ రామలింగేశ్వరాలయంలో అమ్మవారికి హారతి ఇచ్చారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, రెనోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, చుక్క రవి, గునిశెట్టి రవీందర్, పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్, అక్టోబర్ 15: దసరా శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా కుల, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మండపాల్లో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకొచ్చి దుర్గామాతను ప్రతిష్ఠించారు. స్థానిక ఖాదీ హనుమాన్ ఆలయం నుంచి దుర్గామాతను దీక్షాపరులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళహారతులతో ఊరేగింపుగా త్రిశక్తి ఆలయానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేపట్టారు. మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు అధ్యక్షుడు మైలారపు రాంబాబు సంతోషిని దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, దీక్షాపరులు ద్యావనపల్లి రాజారాం, గుజ్జెటి శ్రీనివాస్, బేతు భాస్కర్, వాసాల నరేశ్, ద్యావనపల్లి గణేశ్, శ్రీనివాస్, శివ, మనోజ్, ఉపకోల అవినాశ్, శివ, మోక్షిత్, ఆర్యవైశ్య సంఘ, త్రిశక్తి ఆలయ కమిటీ సభ్యులు, ఆయా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు పాల్గొన్నారు.

కోరుట్ల, అక్టోబర్ 15: పట్టణంలో ఆదివారం దసరా దుర్గా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వేంకటేశ్వర స్వామి, కోటి నవదుర్గా, మహాదేవ స్వామి, అష్టలక్ష్మీ, అయ్యప్ప జ్ఞాన సరస్వతీ మాత, త్రిశక్తి ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేశారు. భక్తులు దుర్గాభవానీ మాత దీక్ష తీసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

కథలాపూర్, అక్టోబర్ 15: మండలంలోని గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రులు పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. మండలంలోని కథలాపూర్, చింతకుంట గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

మేడిపల్లి, అక్టోబర్ 15 : మేడిపల్లి, భీమారం మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాలలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు, కుల సంఘాల సభ్యులు, యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం దుర్గా దేవి అమ్మవారు కొలువుదీరారు. గ్రామాల్లో ప్రధాన కూడల్ల వద్ద ఆయా కుల, యువజన సంఘాల ఆధ్వర్యాల్లో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకొని ప్రత్యేక అలంకరణలతో ఏర్పాటు చేసిన దుర్గా మండపాల్లో దుర్గామాతను నిర్వహాకులు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కుల, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెగడపల్లి, అక్టోబర్ 15: మండలంలో ఘనంగా ప్రారంభమైన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలుపెగడపల్లి, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు బతికపల్లి, నామాపూర్, నంచర్ల, వెంగళాయిపేట, కీచులాటపల్లి, నందగిరి, ఆరవల్లి, దోమలకుంట తదితర గ్రామాల్లోని ఆలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద దుర్గాదేవీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆలయ కమిటీ సభ్యులు, భవానీ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

ధర్మపురి: ఊరేగింపు సేవ నిర్వహిస్తున్న భక్తులు